## తమ అనుయాయులకు కట్టబెట్టడానికే ఓయూ టెండర్ల కెటాయింపులో జాప్యం



**దశ, ఓయూ:** ఉస్మానియా యూనివర్సిటీలో హాస్టల్, మెస్ పర్సనల్, సానిటేషన్, హౌజ్ కీపింగ్ పర్సనల్ విభాగాల్లో టెండర్లు ఆహ్వానించారు. దీనికిగాను చాలా మంది దాదాపు రూ. 10 లక్షలు ఈఎండి చెల్లించి టెండర్ దాఖలు చేశారు. గత మార్చి 20 నుంచి 30వ తేదీ వరకు గడువు విధించారు. అదనంగా మరోసారి ఏప్రిల్ 7 వరకు గడువు పొడగించారు. అదే రోజు 7న టెండర్లు ఓపెన్ చేశారు కానీ ఎవరికి టెండరు. దక్కిందో చెప్పకుండా పెండింగ్లో పెట్టారు. టెండర్ దాఖలు చేసిన వారు దాదాపు 20 రోజులుగా ఓయూ చుట్టు చక్కర్లు కొడుతున్నారు. ఈ సందర్భంగా కొందరు మాట్లాడుతూ ఓపెన్ చేసిన తరువాత కూడా టెండర్లు కెటాయించకుండా ఓయూలోని కొందరు అధికారులు కావాలనీ జాప్యం చేస్తున్నారనీ ఆరోపిస్తున్నారు. ప్రధానంగా తమకు నచ్చిన వారికే టెండర్లు ఇవ్వడానికి కొందరు ఓయూ అధికారులు శతవిధాలుగా ప్రయత్నాలు చేస్తున్నారనీ పలువురు టెండర్ దారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా వైస్చన్సలర్, ఓయూ ఉన్నతాధికారులు స్పందించి వెంటనే టెండర్లు కెటాయించాలనీ కోరుతున్నారు.

## ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌కు ఘనంగా వీడ్కోలు



**దశ, ఎల్బీ నగర్ :** ఎల్బీనగర్ జోనల్ కమిషనర్‌గా తన బాధ్యతలను విజయవంతంగా పూర్తి చేసి, నాగర్ కర్నూల్‌కు బదిలీ అయిన హేమంత్ కేశవ్ పాటిల్ ని హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మరియు ఎల్బీనగర్ తాజా మాజీ కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ, ఎల్బీనగర్ పరిధిలో ప్రజా సమస్యల పరిష్కారానికి జోనల్ కమిషనర్‌గా హేమంత్ కేశవ్ పాటిల్ చేసిన సేవలు ఎంతో ప్రశంసనీయమని కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి కార్యక్రమాలకు విశేష కృషి చేశారని, తద్వారా ప్రజల మన్ననలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ తాజా మాజీ కార్పొరేటర్లతో పాటు బీజేపీ హయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గోవింద చారి మరియు తదితరులు పాల్గొని కమిషనర్‌కు వీడ్కోలు పలికారు.

## ఎమ్మెల్యే బంధువు భూముల కోసమే బైపాస్ రోడ్?

❖ రోడ్డు నిర్మాణంపై మంథని ఎమ్మెల్యే పునరాలోచన చేయాలి

❖ మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్



**దశ, మంథని:** మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బంధువు భూములకు విలువ పెంచేందుకే బైపాస్ రోడ్డు ప్రతిపాదించారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. మంగళవారం అంగుళూరు శివారులో ప్రతిపాదిత శ్రీపాద బైపాస్ రోడ్డు ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, ఈ రోడ్డుతో ప్రజలకు ఉపయోగం లేదని, పలుమార్లు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. రెండేళ్ల క్రితమే జీఓ వచ్చినప్పటికీ భూసేకరణకు ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని, ఈ ప్రాజెక్ట్ వల్ల సుమారు 80 ఎకరాలు, 137 రైతు కుటుంబాలు ప్రభావితమవుతాయని చెప్పారు. ప్రభావితులలో ఎక్కువ మంది బలహీన వర్గాలకు చెందినవారని పేర్కొన్నారు. కేవలం బంధువుల ప్రయోజనాల కోసమే ఈ రోడ్డును ముందుకు తీసుకెళ్తున్నారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో రెండు పంటలు పండుతున్న ఈ పచ్చని భూములను అవసరం లేని రోడ్డు కోసం తీసుకోవడం సరైంది కాదని, కరకట్టల వల్ల భవిష్యత్తులో పంటలు మునిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో మల్లారం ప్రాంతంలో ఇదే పరిస్థితి ఎదురైందని గుర్తు చేశారు. అవసరమైతే బోయిన్‌పేట, గొల్లగూడెం మార్గంగా రింగ్‌రోడ్డు నిర్మిస్తే ప్రజలకు ఉపయోగం ఉంటుందని సూచించారు. ప్రజలకు నష్టం కలిగించే ఈ బైపాస్ రోడ్డుపై వెంటనే పునరాలోచన చేసి నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## దివ్యాంగుల కోసం సహాయ ఉపకరణాల పంపిణీ

**దశ,కామారెడ్డి:** తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో విద్యార్థులు, దివ్యాంగుల కోసం సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి సీతక్క, ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్, జహీరాబాద్ ఎంపీ సురేష్ షట్కర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అర్హులైన 64 మంది దివ్యాంగులకు ద్విచక్ర వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిళ్లు మరియు ఇతర సహాయక ఉపకరణాలు పంపిణీ చేశారు. లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమాన్ని ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యంగా తీసుకుంటోందని, వారు స్వయం సమృద్ధిగా జీవించేలా చేయడం లక్ష్యమని తెలిపారు. అవసరమైన ఉపకరణాలు అందించడం ద్వారా వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. మొహమ్మద్ అలీ షబ్బీర్ మాట్లాడుతూ దివ్యాంగులు వెనుకబడకుండా ముందుకు సాగేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అందజేసిన వాహనాలు వారికి ఉపాధి, స్వయం ఆధారిత జీవనానికి దోహదపడతాయని అన్నారు.ఎంపీ సురేష్ షట్కర్ మాట్లాడుతూ దివ్యాంగుల అభివృద్ధి సమాజ అభివృద్ధికి కీలకమని, మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయండి



❖ బ్రహ్మోత్సవ కరపత్రం ఆవిష్కరించిన ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు.

**దశ, సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం నుండి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు కోరారు. మంగళవారం ఆలయంలో ఉత్సవ పూర్వరంగ కార్యక్రమాలు ప్రారంభించారు. ఉదయం స్వామివారికి ఉత్సవ ఆరంభ స్నపనం (108 కలశములతో అభిషేకం) నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్న ప్రసాదం అందజేశారు. సాయంత్రం ఆలయ ముఖ మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజపట ఆధివాసం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. నేడు బుధవారం ఉదయం అగ్నిప్రతిష్ఠ,ధ్వజారోహణం, గరుడముద్ద, ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేయనున్నట్లు వేణుగోపాలచార్యులు తెలిపారు. ఐదు రోజులు జరిగే ఈ బ్రహ్మోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ ఇన్చార్జి జ్యోతిరెడ్డి వికాస తరంగిణిసభ్యులుబజ్జూరికృష్ణయ్యచల్లాశ్రీనివాస్ కరుణాసాగర్ రెడ్డి చికూరి శ్రీనివాస్ తాటికొండ మంజుల, జ్ఞాన కుమారి, వనజ, సరోజ గుండా శ్రీనివాస్ నాగరాజు మరియు ఆలయ సిబ్బంది అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



## డాక్టరేట్ సాధించిన రైతు కూలీ బిడ్డ రామగిరి శేఖర్

**దశ ఓయూ:** మంచిర్యాల జిల్లాలోని మందమర్రి మండలంలోని సారంగపల్లి గ్రామంలోని రైతు కూలీ కుటుంబానికి చెందిన రామగిరి లింగయ్య రత్న ల పెద్దకొడుకు శేఖర్ తల్లితండ్రుల కష్టాన్ని చూసి చలించి ఉన్నత చదువులకోసం సారంగపల్లి ఊరు నుంచి హైదరాబాద్ లోని ఉస్మానియా యూనివర్సిటీ వరకు చేరుకొని బిజినెస్ మేనేజ్మెంట్లో పీఎచ్డి సీటుని సాధించి, ప్రొఫెసర్ డా.ఆర్.వెంకటేశ్వర్ రావు పర్యవేక్షణలో ది రోల్ ఆఫ్ కన్స్యూమర్ డ్యూరబుల్ ఫైనాన్స్ ఇన్ ఎలక్ట్రానిక్స్ రిటైల్ ఇన్ హైదరాబాద్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసుకొని డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. ఈ సందర్భంగా డా. రామగిరి శేఖర్ కు పలువురు ప్రొఫెసర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు. 100 సంవత్సరాల చరిత్ర గల ఉస్మానియా యూనివర్సిటీలో పీఎచ్డి పరిశోధన పూర్తి చేసుకొని డాక్టరేట్ పట్టా పొందడం ఎంతో సంతోషకరమని శేఖర్ తెలిపారు. పీఎచ్డి పరిశోధనలో మార్గదర్శకులు ప్రొఫెసర్ డా.ఆర్.వెంకటేశ్వర్లు ప్రోత్సహించి పరిశోధన దిగ్విజయంగా పూర్తి చేయటానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.




## మాదకద్రవ్యాల వినియోగంపై అవగాహన కార్యక్రమం

**దశ నేరేడుచర్ల:** మాదకద్రవ్యాలు గాంజా ఇలాంటి డ్రగ్స్ బారి నుండి మన పిల్లలను మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ఐదవ అంశం పిల్లల భద్రత మాదకద్రవ్యాల నిర్మూలన సందర్భంగా ఈరోజు ఎస్పీ గారి ఆదేశాల మేరకు నేరేడుచర్ల మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్సై రవీందర్ మాట్లాడుతూ మాదకద్రవ్యాలను నిర్మూలించి వాటి భారీ నుండి మన పిల్లలను మన సమాజాన్ని రక్షించుకోవడం అందరి బాధ్యత అని తెలియజేశారు. డ్రగ్స్ వినియోగించడం వల్ల యువత జీవితం నాశనం అవుతుందని అనారోగ్యాల పాలవుతారని జీవితం అర్ధంతరంగా ముగుస్తుందని తెలియజేశారు. మాదకద్రవ్యాలను గంజాయి లాంటి డ్రగ్స్ ను నిర్మూలించాల్సిన బాధ్యత మన అందరిపై ఉన్నదని దీనికి సంబంధించిన సమాచారాన్ని పోలీసు వారికి అందించాలని తెలియజేశారు.

## ఎమ్మెల్సీ, ప్రొఫెసర్ కోదండరాంకు ఉద్యమకారుల ఘన శుభాకాంక్షలు




**దశ, హైదరాబాద్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ (రిజిస్టర్) ఆధ్వర్యంలో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసిన ప్రొఫెసర్ కోదండరాం కి ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. రాష్ట్ర అధ్యక్షులు ఓరుగంటి ఆనంద్ నాయకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని కోదండరాం కి బొకే అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఓరుగంటి ఆనంద్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి రథసారథిగా నిలిచిన కోదండరాం గారు ఎమ్మెల్సీ పదవికి మరింత వన్నె తెస్తారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, శాసన మండలిలో ప్రజల గొంతుకగా నిలుస్తారని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొంత యాదిరెడ్డి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు జానకి రెడ్డి, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జోర్క రామ్ ముదిరాజ్, వసుపరి బలరాం కుర్మా, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు కోదండరాం గారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన సేవలు రాష్ట్రానికి మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు.

## పెట్రోల్ బంక్లో బారులు తీరిన వాహనదారులు



**దశ ఓయూ:** పెట్రోల్ కొరత ఏర్పడి రానున్న రోజుల్లో బంక్లు మూతపడతాయని సామాజిక మాధ్యమాల్లో ప్రచారం కావడంతో వాహనదారులంతా ఒక్కసారిగా పెట్రోల్ బంక్ల దారి పట్టారు. మంగళవారం ఉదయం నుంచి తార్నాక, లాలాపేట, ఓయూ రోడ్డులోని పలు పెట్రోల్ బంక్ల వద్ద వందల సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. వాహనదారులు ఫుల్ ట్యాంక్ పెట్రోల్ పోయించుకునేందుకు పోటీ పడ్డారు. ద్విక్ర వాహనాలు, క్యాబ్లు, ఆటోలు, కార్లు క్యూ లైన్ కట్టడంతో ఓయూ ఆడిగ్మెట్ రోడ్డులో ట్రాఫిక్ జాం నెలకొంది. ట్రాఫిక్ పోలీసులు బంక్ వద్దకు చేరుకుని ట్రాఫిక్ క్రిలయర్ చేయడానికి కష్టపడాల్సి వచ్చింది.

**వందతులను నమ్మొద్దు..**

తార్నాకలోని పెట్రోల్ బంక్ల వద్ద స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి ప్రవీన్ కుమార్ వాహనదారులతో మాట్లాడారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వందతులను నమ్మవద్దని సూచించారు. ఎండాకాలం ఎండలు మండిపోతున్నాయి..ఈ క్రమంలో పెట్రోల్ ఫుల్ ట్యాంక్ చేసుకుని, డబ్బాల్లో, క్యాన్లలో పెట్రోల్ నిలువ చేసుకుని ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దనీ అవగాహన కల్పించారు. ఎవరికి ఎంత అవసరమో అంతే మోతాదులో పెట్రోల్, డీజిల్ పోసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ నేతికార్ మహేశ్ తదితరులున్నారు.

## దేవరకద్రలో బూత్ లెవల్ ఏజెంట్ల నియామకం పూర్తి

❖ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పృథ్వి చౌదరి

**దశ, హైదరాబాద్:** సంఘటన సృజన్ అభియాన్ విస్తృత స్థాయి కార్యక్రమం మంగళవారం గాంధీభవన్‌లో జరిగింది. మహబూబ్‌నగర్ పార్లమెంట్ బూత్ లెవెల్ ఏజెంట్ల నియామకాలకు సంబంధించిన పూర్తి వివరాలను టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్చార్జ్ మీనాక్షి నటరాజ్, ఎఐసిసి సెక్రటరీ సచిన్ సావంత్ లు పరిశీలించారు. టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, దేవరకద్ర నియోజకవర్గ కోఆర్డినేటర్ పృథ్వి చౌదరి ఏజెంట్ల వివరాలను వారికి అందజేశారు. గాంధీ భవన్‌లో జరిగిన నియోజకవర్గ కోఆర్డినేటర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గంలో బూత్ లెవల్ ఏజెంట్లను పూర్తి స్థాయిలో నియమించామని తెలిపారు. పార్టీ ఆదేశాల ప్రకారం వారితో కష్టపడి పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు సంజయ్ ముదిరాజ్, నారాయణపేట డిసిసి అధ్యక్షులు ప్రశాంత్ రెడ్డి, మక్తల్ కోఆర్డినేటర్ గుత్తా అమిత్ రెడ్డి, మహబూబ్నగర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ రామారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# BRSV పోస్ట్ కార్డు ఉద్యమం




**దశ, ఇల్లెందు:** రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన గత 2 సంవత్సరాలుగా బకాయి ఉన్న విద్యార్థుల ఫీజు రీయంబర్స్ మెంట్ నిధులు వెంటనే విడుదల చేసేలా తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ BRSV ఇల్లందు నియోజకవర్గ ఇంఛార్జ్ కాసాని హరిప్రసాద్ యాదవ్, విద్యార్థి, యువజన నాయకులతో కలిసి ఇల్లందు తపాలా కార్యాలయం నందు తెలంగాణ రాష్ట్ర ప్రధాన న్యాయమూర్తికి పోస్ట్ కార్డు ద్వారా వినతుల పంపించడం జరిగింది.

ఈ సందర్భంగా BRSV నాయకులు కాసాని హరిప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం 8 వేల కోట్ల ఫీజు రీయంబర్స్ మెంట్ బకాయిలు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు దృష్టిలో ఉంచుకొని బి.ఆర్.ఎస్వి ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా BRSV ఫీజు పోరుబాట పేరిట నిరసన కార్యక్రమాలకు పిలుపునివ్వడం జరిగిందని తెలియజేశారు. విద్యార్థుల ఫీజు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయకపోవడం వల్ల పై తరగతులకు వెళ్లడానికి అదేవిధంగా ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలో ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకపోవడం వల్ల ఉద్యోగ అవకాశాలను కోల్పోవడం జరుగుతుందనీ,ఈ ప్రభుత్వానికి బడా కాంట్రాక్టులకు కమిషన్ ఇచ్చే కాంట్రాక్టులకు బిల్లులు చెల్లిస్తుంది కానీ, 13 లక్షల మంది విద్యార్థి భవిష్యత్తు కొరకు రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయడం లేదని, విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయకుండా విద్యార్థుల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేకుండా వ్యవహరిస్తూ, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయకుండా ఎందరో విద్యార్థులను మనోవేదనకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి గారు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే చెల్లిస్తామనిహామీఇచ్చిరెండున్నరసంవత్సరాలు దాటిన ఇప్పటివరకు చెల్లించకపోవడం వల్ల విద్యార్థులు మానసిక క్షోభకి గురై సరైన విద్యను పొందలేకపోతున్నారు . ఈ కార్యక్రమంలో విద్యార్థి మరియు యువజన నాయకులు నీలం రాజశేఖర్,నెమలి నికిల్,వాంకుడోత్ పిన్ నాయక్,, గౌస్ పాషా,గిన్నారపు రాజేష్, సత్తాల హరికృష్ణ, చాంద్ పాషా, మీర్జా, వార.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలకు వితరణ



**దశ, మణుగూరు:** మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత సేవా కార్యక్రమాల్లో భాగంగా మణుగూరు మండలం రాజీవ్ గాంధీ నగర్ ప్రాంతానికి చెందిన భూక్య రవి(38) సంవత్సరాలు వడదెబ్బతో మంగళవారం మరణించారు. వీరిది నిరుపేద కుటుంబం ఇది తెలిసి మేము సైతం మిత్రమండలి చారిటబుల్ ట్రస్ట్స్పందించి ట్రస్ట్ద్వారా రవి కుటుంబ సభ్యులకు 3000/ రూపాయలు దహన సంస్కరాల కోసం అందచెయ్యడం జరిగింది. ఈ కార్యక్రమంలో మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ కోశాధికారి రంగా శ్రీనివాస్ రావు, ట్రస్ట్ సభ్యులు P జగన్ మోహన్, తమ్మిశెట్టి వాసు, చిందుకూరి రామారావు, గ్రామ పెద్దలు. పుచ్చకాయల శంకర్,లాలు, మురళి తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నివారణ ప్రతి ఒక్కరి భాధ్యత

❖ మణుగూరు డిఎస్పీ రవీందర్‌రెడ్డి




**దశ, మణుగూరు:** మణుగూరు మున్సిపాలిటీ బాపనకుంటలో బాల్య వివాహాల నివారణ పై విద్యార్థులకు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల మూలంగా భావితరాలు చాలా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందన్నారు. బాలికలకు మేజర్ అయిన తర్వాత సమాజంలో ఎలా బతకాలి అనే విషయం అరధం అవుతుందన్నారు. అదే విధంగా వివాహం తర్వాత కూడా మేజర్ ఉన్న వారికి అనారోగ్య సమస్యలు రావని తెలిపారు. బాల్య వివాహాల నివారణ చేయాల్సిన భాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపాలిటీ కమిషనర్ ప్రసాద్, సిఐ నాగబాబు, ఎస్ఐ శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిందితుల అరెస్ట్ చేసిన మణుగూరు పోలీసులు




**దశ, మణుగూరు:** మండలంలోని న్యూ పద్మ గూడెం గ్రామంలో ఓ ఇంటిలో గంజాయిని అమ్ముతున్నారనే సమాచారం మేరకు మణుగూరు డిఎస్పి వంగా రవీం దర్ రెడ్డి ఆదేశాల మేరకు సిఐ నాగబాబు నేతృత్వంలో పోలీసులు ఆ ఇంటిలో తనిఖీలు చేపట్టారు. 1.085 గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకొని ఇంటి యజమాని ను విచారించగా గుట్టు మల్లా రానికి చెందిన సాయి @ గుట్ట సాయి వద్ద గంజాయి కొనుగోలు చేసి అమ్ముతు న్నానని నేను సత్తుపల్లి కి చెందిన జుజునూరి సింహాద్రి@ సందీప్ కి గంజాయి అమ్ముతానని తెలపగా మి డియం గోవిందు, సాయి @గుట్ట సాయి, జుజునూరి సింహాద్రి@ సందీప్ ల పై కేసు నమోదు చేసి మిడియం గోవిందును జ్యుడీషియల్ రిమాండ్ కి తరలించినట్టు సిఐ నాగబాబు మీడియాకు తెలిపారు.



## అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత మజ్జిగ పంపిణీ

**దశ, మణుగూరు:** మణుగూరు అంబేద్కర్ సెంటర్లో అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం మణుగూరు అశోక్ నగర్ లో అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రం ఉత్తర నక్షత్రం సందర్భంగా మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం దాతల సహాయంతో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మణుగూరు అంబేద్కర్ సెంటర్లో అయ్యప్ప స్వామి జన్మ ఉత్తర నక్షత్ర పర్వదినం సందర్భంగా 3000 మందికి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మాధవరావు , ఉప సర్పంచ్ గాండ్ల సురేష్, నెట్టం రాధాకృష్ణ, వల్లభనేని నాగేశ్వరరావు, భోగి చంద్రరావు ఈ మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ మజ్జిగ పంపిణీలో తెలంగాణ రాష్ట్ర జోన్ ఈస్ట్ జోనల్ సెక్రెటరీ బోర్ల శ్రీనివాస్, ఇటికాల వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, బూర రవికుమార్, ఈర్ల రాము, వీరన్న, వెంకటేశ్వర్లు, ప్రసాద్ చారి లు పాల్గొన్నారు.

## భద్రాచలంలో హిందూ సమ్మేళనం కరపత్రాల ఆవిష్కరణ



**దశ, భద్రాచలం:** భద్రాచలం జూనియర్ కళాశాల మైదానంలో మే 3 ఆదివారం జరగనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లు దశలవారీగా వేగం పుంజుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో భద్రాచలం పట్టణంలో హిందూ సమ్మేళనం ఉత్సవ కమిటీ అధ్యక్షులు పాకాల దుర్గాప్రసాద్ నివాసంలో మంగళవారం కరపత్రాలను ఆవిష్కరించి ప్రచార కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ,హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించడం మరియు ధార్మిక విలువలను బలపరచడం ఈ సమ్మేళన ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటికే నిర్వహించిన సమన్వయ సమావేశాల ద్వారా ఏర్పాట్లను పర్యవేక్షించామని, ఇప్పుడు కరపత్రాల విడుదలతో గ్రామాలు, వార్డుల స్థాయిలో ప్రచారాన్ని విస్తరించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ మహా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళనం భద్రాచలం నగర ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎం.వి. సుబ్రహ్మణ్యం, కోశాధికారి నాగభూషణ శాస్త్రి, గోపి కిషోర్, ఎ. శ్రీనివాస రెడ్డి, జె. శ్రీనివాస రావు, శ్రీమతి అన్నపూర్ణ, సిద్ధార్థ, కుంజా సంతోష్ తదితరులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు.

## మణుగూరులో గంజాయి విక్రయ ముఠా గుట్టురట్టు

❖ 1.085 కిలోల గంజాయి స్వాధీనం

❖ నిందితుడి అరెస్ట్ మిగిలిన వారిపై కేసు నమోదు




**దశ, మణుగూరు:** మణుగూరు పట్టణంలోని న్యూ పద్మగూడెం ప్రాంతంలో గంజాయి విక్రయిస్తున్న ముఠాను పోలీసులు బహిర్గతం చేశారు. గోప్య సమాచారంపై స్పందించిన పోలీసులు మెరుపుదాడి చేసి ప్రధాన నిందితుడిని అరెస్టు చేశారు. మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మణుగూరు సీఐ నాగబాబు వెల్లడించిన వివరాల ప్రకారం న్యూ పద్మగూడెం ప్రాంతానికి చెందిన మిడియం గోవింద్, తండ్రి మల్లయ్య తన నివాసంలో గంజాయి విక్రయిస్తున్నాడనే నమ్మదగిన సమాచారం పోలీసులకు అందింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు గోవింద్ ఇంటిపై దాడి చేసి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఇంటిలో దాచిపెట్టిన 1.085 కిలోల గంజాయిను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం గోవింద్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, గంజాయి సరఫరా వ్యవహారంపై కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. గోవింద్ వెల్లడించిన ప్రకారం, గుట్టమల్లారం గ్రామానికి చెందిన సాయి (గుట్ట సాయి) వద్ద గంజాయి కొనుగోలు చేసి, సత్తుపల్లి ప్రాంతానికి చెందిన జుజునూరి సింహాద్రి (సందీప్)కు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. ఈ మేరకు మిడియం గోవింద్, సాయి (గుట్ట సాయి), జుజునూరి సింహాద్రి (సందీప్)లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు గోవింద్‌ను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. మిగిలిన నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు సీఐ నాగబాబు తెలిపారు.

## మణుగూరు భద్రాద్రి స్టేడియంలో 25 రోజుల పాటు ప్రత్యేక శిక్షణ

❖ 18 ఏళ్లలోపు బాలబాలికలకు ఐదు క్రీడా విభాగాల్లో కోచింగ్

❖ ఉద్యోగుల పిల్లల సమగ్ర అభివృద్ధికి పెద్దపీట



**దశ, మణుగూరు:** సింగరేణి ఉద్యోగుల పిల్లల్లో క్రీడా నైపుణ్యాలను వెలికితీయడం, వారిని శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ గల పౌరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా మణుగూరు ఏరియాలో 'వేసవి క్రీడా శిక్షణా కార్యక్రమం' అట్టహాసంగా ప్రారంభమైంది. మంగళవారం పీవీ కాలనీలోని భద్రాద్రి స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈ ప్రారంభోత్సవానికి ఎస్ఓ టు జీఎం బి. శ్రీనివాసచారి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా శ్రీనివాసచారి మాట్లాడుతూ.. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంపొందించడం ద్వారా విద్యార్థులు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును నిర్మించుకోవచ్చు. సింగరేణి యాజమాన్యం ఉద్యోగుల పిల్లల సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఏరియాల్లో శిక్షణకు అవసరమైన నిధులను ప్రత్యేకంగా కేటాయించింది అని తెలిపారు. నేటి నుంచి మే 22 వరకు అంటే మొత్తం 25 రోజుల పాటు ఈ శిక్షణా కార్యక్రమం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. 18 ఏళ్లలోపు వయసున్న సింగరేణి ఉద్యోగుల పిల్లల కోసం ఈ శిబిరాన్ని రూపొందించారు. అనుభవం కలిగిన కోచ్‌ల పర్యవేక్షణలో ఫుట్‌బాల్, వాలీబాల్, బాస్కెట్‌బాల్, కరాటే, అథ్లెటిక్స్ క్రీడల్లో శిక్షణ అందిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు మేకల ఈశ్వర్, ఐఎన్‌టీయూసీ నాయకులు అబ్దుల్ రవూఫ్, సీఎంఓఏఐ జనరల్ సెక్రటరీ వి. మదన్ నాయక్, సీనియర్ పర్సనల్ అధికారి సింగు శ్రీనివాస్, డబ్ల్యూపీఎస్ అండ్ జీఏ సెక్రటరీ డి. నరేశ్, స్పోర్ట్స్ కోఆర్డినేటర్ సి.హెచ్. వెంకటేశ్వరరావు, కోచ్‌లు, సింగరేణి ఉద్యోగులు మరియు పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.